అరకొర జీతాలు.. టీచర్ల తిప్పలు!

- ప్రైవేట్ టీచర్లకు చాలీచాలని వేతనాలు
- జీవో నంబర్ 1 అమలు చేయాలని డిమాండ్
- పట్టించుకోని యాజమాన్యాలు

ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. అటు ప్రభుత్వ ఉద్యోగానికి నోచుకోక.. ఇటు జీవితంలో స్థిరపడక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా కూడా అంతంతే అందుతున్న వేతనాలతో శ్రమదోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పోటీ పడుతూ ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ కనీస గౌరవంతో పాటు గుర్తింపునకు కూడా నోచుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. – కౌటాల



జిల్లాలో 1300 మంది టీచర్లు

జిల్లాలో మొత్తం 110 వరకు ప్రైవేట్ స్కూళ్లు ఉండగా, వాటిలో సుమారు 25వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో సుమారు 1300 మందికి పైగా ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఏటా కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా పాఠశాలల్లో కొత్త విద్యార్థులను చేర్పించాలని యాజమాన్యాలు టీచర్లకు టార్గెట్లు విధిస్తున్నాయి. ఇందు కోసం ఉపాధ్యాయులు గ్రూపులుగా ఏర్పడి గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా ఇంటింటికీ కరపత్రాలు పంచడం, పాఠశాల అడ్మిషన్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. తోటి పాఠశాలలకు ధీటుగా ఉత్తీర్ణత శాతం పెంపునకు ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి మానసికంగా కూడా వారిని వేధిస్తున్నారని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పదో తరగతి పరీక్షల సమయంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల పేరిట అధిక సమయం పాఠశాలల్లో గడుపుతున్నారు. ఇలా బతుకు బండిని భారంగా నెట్టుకొస్తున్నా ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సంక్షేమానికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్1 ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదని ప్రైవేట్ ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

1994లోనే జీవో విడుదల

ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సంక్షేమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994లో జీవో నంబర్ 1ని ప్రభుత్వం విడుదల చేసింది. అయితే జీవో 1 అమలు జరుగుతున్న దాఖలాలు లేవు. ఈ జీవో ప్రకారం యాజమాన్యాలు వసూలు చేసే ఫీజుల్లో 50శాతం బోధన సిబ్బందికి వేతనాలుగా అందించాలి. 15 శాతం ఉపాధ్యాయుల సంక్షేమానికి కేటాయించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలి. వీటికి ప్రైవేటు విద్యాసంస్థలు తమ వంతుగా చెల్లించాల్సిన సొమ్ము జమచేయాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలు, తొలగింపులు స్థానిక ఎంఈవో లేక డీఈవో పర్యవేక్షణలో జరగాలి. ఉపాధ్యాయుడిగా తొలగించే ముందు విధిగా నోటీసులు అందించాలి. సరైన కారణం లేకుండా తొలగించరాదు. ఇవన్నీ ఎక్కడ కూడా అమలు కావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు..

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు రెండు, మూడు పాఠశాలల్లో మినహా అన్ని పాఠశాలల్లో నెలకు రూ. 6 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ కనీస వేతనాలు అమలు చేయడం లేదు. ఉన్నతాధికారులు, యాజమాన్యాలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

క్లుప్తంగా

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న రామారావు

దండేపల్లి: తపాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలశాఖ మంచిర్యాల డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామారావు అన్నారు. దండేపల్లి తపాల శాఖ కార్యాలయం ఆవరణలో మంగళవారం తపాల సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తపాలశాఖ అందిస్తున్న పొదుపు పథకాలు, బీమాపథకాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తపాల ఖాతా కలిగి ఉండాలన్నారు. అనంతరం కొత్తగా 300 తపాల ఖాతాలను తెరిచారు. కార్యక్రమంలో పోస్టల్ పేమెంట్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, పోస్ట్‌మాస్టర్ గురువయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏవో కవిత మంగళవారం వరి, పత్తి పంటలను పరిశీలించారు. వరి పంటలో ఆకు చుట్టూ పురుగు ఎక్కువగా ఉందని, దీని నివారణకు కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ ను పిచికారీ చేయాలని సూచించారు. అగ్గితెగులుకు ట్రైసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. వరిలో సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్ మందును పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంటలో తడి లేనిదే మందులు పిచికారీ చేయొద్దని, పంటకు ఆశించే గులాబీరంగు పురుగు, పొగాకు లద్దె పురుగు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో సాయికృష్ణ ఉన్నారు.

పశువైద్య శిబిరం



వైద్యం చేస్తున్న వైద్యాధికారులు

లక్సెట్టిపేట: మండలంలోని మిట్టపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో పశువులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా వైద్యాధికారి రమేష్ పశువులకు టీకాలు వేయించి, అవగాహన కల్పించారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, డొబ్బరోగం ఎక్కువగా వ్యాప్తిస్తుందని, వాటికి సంబంధించిన వ్యాక్సిన్ అందించాలని సూచించారు. అనంతరం 1914 గొర్రెలు, 385 మేకలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్వేత, అనిల్, గోపాల మిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, ఉపాధ్యాయులు నాగేందర్, పద్మ, శ్రీదేవి, రజిత, మురళిలను విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాలలో బదిలీపై వెళ్తున్న వారికి తీపి గుర్తుగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. జిగ్నాస ప్రయోగశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తప్పకుండా సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తూ, పలు ప్రయోగాలను విద్యార్థుల ముందుంచారు. డీఈఓ యాదయ్య ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పర్యవేక్షణలో జిగ్నాస నిర్వాహకులు సాయికుమార్, సంపత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.గురువయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. మానవ శరీరం, అంతర్గత అవయవాల పనితీరును ప్రయోగాత్మకంగా వివరించారు.

మద్యం పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో కిరాణా దుకాణంలో మంగళవారం విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. మండలంలోని కిరాణా దుకాణాల్లో కొనసాగుతున్న మద్యం విక్రయాలపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'గుట్టుగా బెల్టు దందా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని అంకుసాపూర్ గ్రామంలోని జేశ్వాల్ మీనా కిరాణా షాపులో తనిఖీ చేసి 14 (180 ఎంఎల్) మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కిరాణాషాపు యజమానిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై స్వాతి, సిబ్బంది కుమార్, మంజుల, రవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందాల నివేదికల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీ నివేదికలను డీఆర్‌డీఏ అదనపు అధికారి కుటుంబరావు పరిశీలించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఈఎస్ఐ పనులపై సామాజిక తనిఖీలు బృందాలు గత నెల 31 నుంచి ఈనెల 6 వరకు తనిఖీలు చేయగా, ఆ నివేదికలను పరిశీలించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సాయిశ్రీ,, ఎస్‌సీఈఆర్‌పీ కొమురయ్య, ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, ఏపీవోలు బుచ్చన్న, సోహెబ్, విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు కౌటిల్య

తిర్యాణి: మండలంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 60 మంది విద్యార్థినులను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆరుగురు విద్యార్థినుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. వైద్యుడు కౌటిల్య మాట్లాడుతూ విద్యార్థినులు తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌యూవో నైతం శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ పరుశురాం, వైద్య సిబ్బంది ఉన్నారు.

డ్రాప్‌బాక్స్‌ను క్లియర్ చేయాలి

కెరమెరి: డ్రాప్‌బాక్స్‌ను క్లియర్ చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి రాథోడ్ సుభాశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కంప్యూటర్‌లో డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థుల వివరాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు డ్రాప్‌బాక్స్‌లో ఉన్నారన్నారు. పాఠశాల రిజిస్టర్లలో, యూడైస్‌లో విద్యార్థుల సంఖ్య సమానంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం సుల్తాన్‌గూడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఐసీ కోఆర్డినేటర్ వై.అశ్విని, సీసీవో మహేందర్, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.



డ్రాప్‌బాక్స్ వివరాలు పరిశీలిస్తున్న రాథోడ్ సుభాశ్

మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



మహాసభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని గోలేటిలో బేడ బుడగ జంగాల ఆధ్వర్యంలో మంగళవారం ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగలు, ఉపకులాల విశ్వరూప మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా బేడ బుడగ జంగాల రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పస్తం పోషం, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపెల్లి ప్రభాకర్‌లు మాట్లాడుతూ 11వ తేదీన నిర్వహించే మాదిగలు, ఉపకులాల విశ్వరూపం మహాసభకు ప్రధాని నరేంద్రమోడీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు వెంటనే చట్టబద్ధత కల్పించి మాదిగల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

కౌటాలలో..

కౌటాల: హైదరాబాద్‌లో ఈ నెల 11న జరిగే విశ్వరూప మహాసభను ఎమ్మార్పీఎస్ నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ పిట్టల సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ ముఖ్య అతిథిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడి రానున్నట్లు తెలిపారు. ఎస్సీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నక్క శంకర్, అశోక్, నీలయ్య, వెంకటి, వెంకయ్య, తార, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమంతో నాయకత్వ లక్షణాలు'

రెబ్బెన: స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంతో విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వంకుల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం జాడి ప్రభాకర్, కబ్ మాస్టర్ రాజకమలాకర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం వంకులం పాఠశాలలో ఫ్లాగ్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ, మంగళ్‌దాస్ పక్వాసా, డాక్టర్ హెచ్.ఎస్ కుంజ్రు, రామ్‌వాజ్ పేయిల్, జస్టిస్ వివియన్ బోస్ వంటి వారి కృషి ఫలితంగా స్కౌట్స్, గైడ్స్ ఉద్యమాలను ఒక్కటి చేసి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా నామకరణం చేశారన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఫ్లాగ్ డే స్టిక్కర్లను పంపిణీ చేశారు.



స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఎగురవేస్తున్న హెచ్ఎం ప్రభాకర్

సంతలో మైకుల హోరు

దహెగాం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా పార్టీల నాయకులు ప్రచారం జోరు పెంచారు. ప్రతీరోజు మండల కేంద్రాలతో పాటు, గ్రామాల్లో సైతం ప్రచార రథాలు తిప్పుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారసంత కావడంతో ఆయా పార్టీల ప్రచార రథాలు సంతలోనే తిప్పడంతో సంతకు వచ్చిన ప్రజలు, చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ ఏరియాలో దుకాణదారులు సైతం పార్టీల మైకులతో చాలా తిప్పలు పడుతున్నామని వాపోతున్నారు. మైక్‌ల సౌండ్ తగ్గించాలని కోరుతున్నారు.

దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఏహెచ్ఎస్ పాఠశాలతో పాటు నీల్వాయి కేజీబీవీ విద్యాలయంలో వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో దోమల మందును పిచికారీ చేయించారు. దోమల నివారణ కోసం పాఠశాలలతో పాటు పరిసరాల్లో పిచికారీ చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, శన్ముకచారి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళోత్సవం పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి కళోత్సవ్ ఆకట్టుకున్నాయి. 9 నుంచి 12 తరగతులకు చెందిన విద్యార్థులకు మంగళవారం పోటీలు నిర్వహించారు. గాత్ర సంగీతం, శాస్త్రీయ, వాయిద్య సంగీతం, శాస్త్రీయ నృత్యం, విజువల్ ఆర్ట్, దృశ్య కళ, సహజమైన బొమ్మలు, ఆటలు, నాటక ప్రదర్శన పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచి బాలురు, బాలికలు ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పోచయ్య, సీసీవో రాకేష్, ఎంఐఎస్ సాయి, ఐఈఆర్పీలు సృజన, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు కళోత్సవం సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. మండల విద్యాధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు జానపద నృత్యాలు, క్లాసికల్ నృత్యాలు చేసి అలరించారు. కొందరికి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను ఎంఈవో విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రామన్న, జనార్దన్, మురళీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో బోగి పండుగ

కెరమెరి: మండలంలోని చిన్న సాకడ -ఏ గ్రామంలో మంగళవారం ఆదివాసీలు ఘనంగా బోగి పండుగ నిర్వహించారు. గుస్సాడీ వేషధారణకు ముందు గ్రామాల్లో బోగి పండుగ జరుపుకుంటారు. ఆయా గ్రామాల్లో ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేసి అనంతరం ప్రత్యేక వంటకాలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం సాయంకాలం గుస్సాడీ వేషధారణతో గుస్సాడీలు నృత్యాలు చేశారు. అంబాజీరావు, తుకారం, దంబీరావు, భగ్‌వంత్‌రావు, సెడ్మకి బీర్‌శావ్, లింబారావు, దుందేరావు, యాదోశావ్ ఉన్నారు.



ఏత్మాసార్‌కు పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఆదివాసీ గూడెల్లో ప్రారంభమైన దండారీ

తిర్యాణి: దీపావళి పండుగను పురస్కరించుకొని ఆదివాసీ గూడెలల్లో దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని ఇర్కపెల్లి, గడలపెల్లి గ్రామాల్లో దండారీ మొదటిరోజ సందర్భంగా గుస్సాడీ వేషధారణతో బోగి పండుగ నిర్వహించారు.

రహదారి కష్టాలు



పున్నగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు

- పున్నగూడలో రోడ్డు లేక ఇబ్బందులు
- వర్షాకాలంలో బురదమయం
- ఇక్కట్లు ఎదుర్కొంటున్న ఆదివాసీలు

నార్నూర్: గాదిగూడ మండలంలోని పున్నాగూడ గ్రామం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి మౌలిక వసతులు కానరావడం లేదు. గ్రామంలో దాదాపు వంద ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. గాదిగూడ మండల కేంద్రం నుంచి పున్నగూడకు దాదాపు 10 కి.మీ ఉంటుంది. సరైన లింక్ రోడ్డు లేదు. గ్రామానికి రోడ్డు లేకపోవడంతో తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించారు. రోడ్డు నిండరాళ్లు, గుంతలు తేలి దర్శనమిస్తోంది. ఆటోలు, 108, 104 వాహనాలు రాని పరిస్థితి. రేషన్ దుకాణాలకు మహిళలు, పింఛన్ల కోసం వృద్ధులు కాలినడక వెళ్తూ నరకయాతన పడుతున్నారు.

వర్షాకాలంలో బురదమయం కావడంతో ఆదివాసీలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్డుపై పారడంతో దుర్గంధం వస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన పాలకులు స్పందించి గ్రామంలో బీటీ రోడ్లతో పాటు డ్రెయినేజీలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇబ్బందవుతోంది



పున్నగూడకు రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతుంది. చాలా ఇబ్బందవుతోంది. బీటీ రోడ్డు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బాదుబాయి, సర్పంచ్, దాబా(బి)

త్వరలో పనులు ప్రారంభిస్తాం



గాదిగూడ నుంచి పున్నగూడకి బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు దృష్టి తీసుకెళ్లాం. ఐటీడీఏ నుంచి రూ.2.50 కోట్లు మంజూరైంది. అటవీశాఖ అనుమతి లేదని అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అడ చంద్రకళ రాజు, ఎంపీపీ, గాదిగూడ

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు అన్నారు. మండలంలోని గుండాల గోండుగూడ గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్ తదితరులు ఉన్నారు.

బాలికల ఆత్మరక్షణ కోసమే కరాటే శిక్షణ

రెబ్బెన: కరాటే శిక్షణతో విద్యార్థులకు ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని గంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ లతీఫ్, మాస్టర్ చాపిడి కుమార్‌లు అన్నారు. మంగళవారం పాఠశాలకు చెందిన 6 నుంచి 9వ తరగతి బాలికలకు కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలు ఉత్సాహంగా కరాటే శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కరాటే సాధనతో విద్యార్థులు ఆత్మస్థైర్యం పెరగటంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఆపద సమయంలో కరాటే శిక్షణ ప్రమాదం నుంచి గట్టెక్కించే ఆయుధంగా విద్యార్థులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిని కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకొని కరాటేపై పట్టు సాధించాలని సూచించారు.



బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్

గుడిపేట చెక్‌పోస్ట్‌లో విస్తృత తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నిక ల నేపథ్యంలో హాజీపూర్ మండలం గుడిపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్ వ ద్ద వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. చెక్‌పోస్ట్ ప్రత్యేక అధికారులు సీడీపీఓ హేమసత్య, ఏఎస్సై రమేశ్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు వా హనాలను నిలిపి తనిఖీలు నిర్వహించారు. మంచి ర్యాల నుంచి హాజీపూర్ మండలం దాటి వెళ్తున్న వాహనాలను ఆపి మరీ, తనిఖీ చేపడుతుండగా త నిఖీ ప్రక్రియను పూర్తిగా వీడియోగా చిత్రీకరిస్తున్నారు.



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు